# నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించండి

## కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, భవనాలు, చెరువులు, కుంటలు, తాగునీటి వసతుల తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం కలుగుతున్న వాటికి తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్‌కు లోబడి ప్రతిపాదనలు సిద్ధంచేసి సమర్పించాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ రోడ్లు భవనాల శాఖలకు చెందిన రోడ్లు, కాలువలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటికి తాత్కాలికంగా మరమ్మతులకు ఎస్టిమేట్స్ సిద్ధం చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు సుజాత, శ్రీహరి, డీఈవో రాజు, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, పంచాయతీ రాజ్ ఈఈ బావన్న, నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి**

ఓటరు జాబితా పక్కాగా రూపొందించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. జుక్కల్ నియోజకవర్గంలో 78, ఎల్లారెడ్డిలో 74, కామారెడ్డిలో 49 శాతం ఇంటింటి సర్వే పూర్తయిందని అన్నారు. మార్పులు, చేర్పులు నిర్ణీత ఫారం లో నమోదు చేసుకోవాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన యువతీ,యువకుల నుంచి ఓటు హక్కు కోసం ఫారం 6 ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 18లోగా ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ గౌడ్, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**నిర్ణీత గడువులోగా బియ్యం సరఫరా చేయాలి**

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు నిర్ణీత గడువు ఈ నెల 30వ తేదీలోగా బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. తన చాంబర్‌లో ధాన్యం సరఫరా వేగవంతంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలోని రైస్ మిల్లులు తనిఖీ చేసి బియ్యం ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖలకు సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సహాయ అధికారి నరసింహారావు, టాస్క్‌ఫోర్ ఉప తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## రైతులు మోటర్‌కు కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలి



విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాటలో పాల్గొన్న అధికారులు

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 11 : పంట పొలాల కోసం విద్యుత్‌ను ఉపయోగించే రైతులు కచ్చితంగా మోటర్లకు కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలని ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణగౌడ్ అన్నారు. ఎల్లారెడ్డి శివారులోని పలువురు రైతులకు కెపాసిటర్లపై బుధవారం అవగాహన కోసం విద్యుత్ శాఖ–పొలం బాట కార్యక్రమం ఏర్పాటు చేసి రైతులతో మాట్లాడారు. కెపాసిటర్ పెట్టుకోవడంతో మోటరుపై ఒత్తిడి తగ్గుతుందని, కాలిపోయే అవకాశం ఉండదని రైతులకు వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ సుదర్శన్ రెడ్డి, పలువురు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నేడు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : కామారెడ్డి జిల్లాలోని సమగ్రశిక్షా ఆధ్వర్యంలో కేజీబీవీలో తాత్కాలిక పద్ధతిపై ప్రత్యేకాధికారులు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీ, పీఈటీల ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం మెరిట్ కం రోస్టర్ ప్రకారం 1:3 అభ్యర్థులకు గురువారం జిల్లా కార్యాలయంలో రూమ్ నంబర్ 223లో నిర్వహించనున్నట్లు డీఈవో రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక కాపీ జిరాక్స్ సెట్ తీసుకొని రావాలని, వారికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు, సూచనలు, మార్గదర్శకాలు www.deokamareddy.in వెబ్‌సైట్‌లో పొందుపరచను న్నట్లు తెలిపారు.

## రామకృష్ణకు ఇంపాక్ట్ టీచర్ అవార్డు



రామకృష్ణకు అవార్డు అందజేస్తున్న ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు నాగేశ్వర్ రావు

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : కామారెడ్డి జిల్లాకు చెందిన గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ ఇంపాక్ట్ టీచర్ అవార్డు అందుకున్నాడు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వర్ రావు చేతుల మీదుగా బంజారాహిల్స్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. రామకృష్ణ కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ప్రతి సంవత్సరం గణితంలో విద్యార్థులకు 10 జీపీఏ ఎలా సాధించాలో మెళకువలు బోధిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

## గణేశ్ మండపాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు

బాన్సువాడ రూరల్/బీబీపేట్/మద్నూర్/రామారెడ్డి, సెప్టెంబర్ 11 : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు భక్తుల పూజలు అందుకుంటున్నాయి. మండపాల వద్ద మహిళలు, చిన్న పిల్లలు కోలాటం, దాండియా ఆడుతున్నారు. బోర్లం, హన్మాజీపేట్, దేశాయిపేట్, కోనాపూర్, ఇబ్రహీంపేట్ గ్రామాల్లో మండపాల అలంకరణ, వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. బీబీపేట, మాందాపూర్, మల్కాపూర్, యాడారం, జనగామ, తుజాల్‌పూర్, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండలపాల వద్ద నిర్వాహకులు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మద్నూర్‌లోని కుమార్ గణేశ్ మండపం వద్ద అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. రామారెడ్డిలో యూనివర్సల్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

### ఎల్లారెడ్డిలో కార్యాలయం ప్రారంభం

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 11 : ఎల్లారెడ్డిలో బీజేపీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార బుధవారం ప్రారంభించారు. ఎల్లారెడ్డిలోని అంబేద్కర్ చౌరస్తాలో కామారెడ్డికి వెళ్లేదారిలో ఏర్పా టు చేసిన కార్యాలయ ప్రారంభోత్సవానికి పార్టీ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, లింగారెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు. బాలకిషన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

బాన్సువాడ, సెప్టెంబర్ 11 : ఈ నెల 15న కామారెడ్డి జిల్లాలో నిర్వహించే రెడ్డిల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి రెడ్డి కుటుంబ సభ్యులు పెద్ద మొత్తంలో తరలిరావాలని రాజాబహదూర్ వెంకట్రాంరెడ్డి విద్య ట్రస్టు రాష్ట్ర ప్రతినిధి, రెడ్డి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి బాణాల మల్లారెడ్డి కోరారు. బాన్సువాడ మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం పర్యటించారు. జిల్లాలో రెడ్డి పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపట్టే కార్యక్రమానికి రెడ్డిలు కదలిరావాలని పిలుపునిచ్చారు. మండలంలోని కొల్లూర్ రెడ్డి సంఘం సభ్యులతో కలిసి రెడ్డిల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగారెడ్డి, బాపురెడ్డి, సంజీవరెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాన్సువాడ రెడ్డి సంఘం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, డాక్టర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో

లింగంపేట, సెప్టెంబర్ 11 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల వివరాలు యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని మండల విద్యా శాఖ అధికారి రామస్వామి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూడైస్ ప్లస్‌లో పాఠశాల భవనం, కిచెన్‌షెడ్డు, తాగునీటి వసతి, తరగతి గదులు స్థితిగతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను సంబంధిత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అందించాలని సూచించారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోగాల నివారణకు ప్రత్యేక చర్యలు

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 11 : వర్షాకాలం కావడంతో గ్రామంలో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తెలిపారు. ఇటీవల గ్రామంలో విష జ్వరాలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడ్డారు. గ్రామంలో దోమల బెడదను నివారించేందుకు ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. బుధవారం గ్రామంలో మురికి కాలువల శుభ్రం చేసే పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కారోబార్ దత్తు ఉన్నారు.

## 12 మందిపై కేసు నమోదు

మాచారెడ్డి, సెప్టెంబర్ 11 : మండలంలోని రత్నగిరిపల్లి అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ బీట్ అధికారిణి మహేశ్వరి కంపార్ట్‌మెంట్ 547 రత్నగిరిపల్లిలో బీట్ చేస్తుండగా కొంతమంది వ్యక్తులు చెట్లను నరికి వేస్తుండగా అడ్డుకొని, వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మైసమ్మ చెరువుతండాకు చెందిన 12 మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## రెండు మండలాల్లో సభ్యత్వ నమోదు

మాచారెడ్డి, సెప్టెంబర్ 11 : మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. గజ్యానాయక్‌తండా, ఎక్స్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ హాజరయ్యారు.

## సృజనాత్మకతతో విద్యను బోధించాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి జతాలాల్

మాచారెడ్డి, సెప్టెంబర్ 11 : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గుణాత్మక, సృజనాత్మకతో విద్యను బోధించాలని మాచారెడ్డి, పాల్వంచ మండలాల నోడల్ అధికారులు దేవేందర్‌రావు, జతాలాల్ అన్నారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల స్థాయి కాంప్లెక్స్ సమావేశాన్ని మాచారెడ్డి జడ్పీహెచ్ఎస్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్, ఎన్ఏఎస్ పరీక్షలు పాఠశాల స్థాయిలో సామర్థ్యాల వారీగా అభివృద్ధి చేయాలని, ఎఫ్ఆర్ఎస్ ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినిలు సునీత, అశోక్, మండల ఆర్పీలు శ్రీనివాస్, అర్చన, రమ్య, సీఆర్పీలు సంజీవ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు



బాన్సువాడ లోని కల్కి చెరువును పరిశీలిస్తున్న పట్టణ సీఐ కృష్ణ

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిమజ్జనంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు అన్నారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. నిమజ్జన సమయంలో పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సమావేశంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వినాయక మండపాల సందర్శన**

లింగంపేట, సెప్టెంబర్ 11 : లింగంపేటలోని వినాయక మండపాలను ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సందర్శించారు. సార్వజనిక్ గణేశ్ మండలి వారు డీఎస్పీని, ఎస్సై అరుణ్‌కుమార్‌కు సన్మానించారు. డీఎస్పీ వెంట ఆయా గణేశ్ మండపాల నిర్వాహకులు ఉన్నారు.

**నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**

బాన్సువాడ, సెప్టెంబర్ 11 : వినాయక నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ అన్నారు. బాన్సువాడ పట్టణంలోని పలు వినాయక మండపాలను ట్రాన్స్‌కో అధికారులు, మున్సిపల్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. నిమజ్జనానికి వినాయకులను తరలించే రోడ్డు మ్యాప్‌ను వారు పరిశీలించారు. అనంతరం నిమజ్జనం చేసే కల్కి చెరువు (మినీ ట్యాంకు బండ్‌పై జేసీబీ, క్రేన్ ద్వారా నిమజ్జనం చేసేలా ఏర్పాట్ల పనులపై చర్చించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో పట్టణ ఏఈ నాందేవ్, మున్సిపల్ వార్డు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్న

కామారెడ్డి, సెప్టెంబర్ 11 : అక్టోబర్ 5వ తేదీ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌ను బేషరతుగా అమలు చేయాలని అన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కామారెడ్డిలో నిర్వహించే మహాసభకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లొంక వెంకటరెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, ఆనంద్ రావు, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు కొనసాగించాలి

లింగంపేట, సెప్టెంబర్ 11 : గ్రామంలో పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని ఎంపీవో మలహరి పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలంలోని శెట్పల్లి గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీవో వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆర్థికసాయం అందజేత

బిచ్కుంద/రామారెడ్డి, సెప్టెంబర్ 11 : మండల కేంద్రానికి చెందిన సంతోష్ పాన్‌షాప్ నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు సిద్దేశ్వరి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. డెంగ్యూ వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై వారం రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలుసుకున్న 1987–98 బ్యాచ్‌కి చెందిన చిన్ననాటి మిత్రులు సంతోష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మసూద్, నాల్చార్ శ్రీనివాస్, అనిల్, పండరి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డిలో ఇటీవల మృతి చెందిన తోకల లింగం కుటుంబానికి వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయంతో పాటు 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డి ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

## బదిలీపై వెళ్తున్నవారికి సన్మానం



ఏఎన్ఎం యాదమ్మను సన్మానిస్తున్న ఎంపీడీవో

కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 11 : మండలంలోని క్యాసంపల్లి గ్రామంలో పనిచేసి బదిలీపై రాజంపేట మండలం తలమడ్లకు వెళ్తున్న ఏఎన్ఎం యాదమ్మను ఎంపీడీవో నాగవర్ధన్ మాజీ పాలకవర్గం సమక్షంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంజుల నారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాలకిషన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ భాగ్యలక్ష్మీరాజిరెడ్డి, బాల్‌రాజు, గ్రామ కార్యదర్శి సౌమ్యారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి రైతువేదిక వద్ద బదిలీపై వెళ్తున్న పాల్వంచ మండల ఏవో శ్రీనివాసరావు, చిట్యాలకు వెళ్లిన ఏఈవో అశోక్‌రెడ్డిని రైతులు సన్మానించారు. ఏడీ అపర్ణ, ఏవో పవన్ కుమార్, చిన్నమల్లారెడ్డి ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, నర్సన్నపల్లి మాజీ సర్పంచులు హన్మాండ్లు, రాజు, వెంకటరాజయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రాంరెడ్డి, రవి, బాలయ్య, శ్యామ్, రాజయ్య, రాములు, కిష్టయ్య, గోపాల్, బాలయ్య పాల్గొన్నారు.

## ప్రతి నెలలో నాలుగు ఫిజియోథెరపీ శిబిరాలు



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 11 : దివ్యాంగుల కోసం ప్రతి నెలలో నాలుగు ఉచిత ఫిజియో థెరపీ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విలీన విద్య సమన్వయ కర్త కృష్ణ చైతన్య అన్నారు. ఎల్లారెడ్డిలోని భవిత భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత ఫిజియోథెరపీ శిబిరంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు, సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేశం, ఫిజియోథెరపిస్టు అరుణ్, శివకుమార్, పద్మ, అనిల్ పాల్గొన్నారు.

## వరద బాధితలకు చెక్కు అందజేత

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 11 : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో సతమతమవుతున్న నేపథ్యంలో బీర్కూర్ గ్రామానికి చెందిన సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యుడు కామినేని విజయ్ కుమార్, దత్తు రూ.10వేల చెక్కును లయన్స్ క్లబ్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాలయ్య సభ్యులు కిశోర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ అనఘా షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్స్ (M/F), అర్హత (డిగ్రీ) సాలరీ 15,000/- Month మరియు అనుభవం గల ఎలక్ట్రిషన్ (డిప్లొమ ఎలక్ట్రిషన్) సాలరీ 15,000/- Month కావలెను. ఆసక్తిగలవారు వెంటనే ఐడి ప్రూఫ్, ఫోటో, స్టడీ ర్టిఫికేట్‌తో నేరుగా సంప్రదించగలరు.
NTZ-340382
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం




సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ను అభినందించిన రిజిస్ట్రార్ యాదగిరి

భిక్కనూరు, సెప్టెంబర్ 11 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్న దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, టీయూ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డి, సాయాగౌడ్, నారాయణ, యాలాద్రి, హాస్టల్ వార్డెన్లు కిరణ్ రాథోడ్, గంగాకిషన్, పోతన్న పాల్గొన్నారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు..**

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 11 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్, మండల అధ్యక్షుడు హన్మాండ్లు, రాష్ట్ర బాధ్యులు వెంకాగౌడ్, హన్మాండ్లు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మద్నూర్, సెప్టెంబర్ 11 : డోంగ్లీ మండలంలోని మొఘ గ్రామ శివారులో ఉన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ బుధవారం పరిశీలించారు. అనంతరం మద్నూర్‌లోని రైతువేదికలో రుణమాఫీలో భాగంగా రేషన్‌కార్డు లేనివారికి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేస్తున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఫ్యామిలీ మ్యాపింగ్ చేయాలని మండల వ్యవసాయాధికారి రాజుకు సూచించారు. అనంతరం ఎస్‌బీఐకి వెళ్లి రుణమాఫీ ప్రక్రియను మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గుంతల పూడ్చివేత

బాన్సువాడ, సెప్టెంబర్ 11 : పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లు, కాలనీల్లో ఏర్పడిన గుంతలను బుధవారం మున్సిపల్ పాలకవర్గం, అధికారుల బృందం పరిశీలించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. గణపతి నిమజ్జనం కారణంగా వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ గంగాధర్ తెలిపారు. ఆయన వెంట కమిషనర్ శ్రీహరిబాబు, నాయకులు మహ్మద్ ఎజాస్, ఖాదర్, కౌన్సిలర్లు హకీం, కిరణ్‌కుమార్, రమేశ్, వార్డు అధికారి నగేశ్ పాల్గొన్నారు.



బాన్సువాడలో గుంతలను పూడ్చివేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కమిషనర్ శ్రీహరిబాబు